# కుప్పం ఆర్అండ్‌బీ రోడ్లకు మహర్దశ

## ● రూ.53.27 కోట్లతో అభివృద్ధి


అభివృద్ధి పనులు మంజూరైన కుప్పం-పచ్చూరు రోడ్డునుంచి కుప్పం-కృష్ణగిరి సాగే రోడ్డుపై చెక్కునత్తం సమీపంలో ఉన్న గుంతలు

కుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఒక తట్టమట్టికి కూడా నోచుకోని కుప్పం ఆర్అండ్‌బీ రహదారులు శాశ్వతమైన అభివృద్ధికి అన వాళ్లుగా మారనున్నాయి. కుప్పం నియోజకవర్గ పరిధిలో మొత్తంగా రూ.53.27 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో పంచాయతీలను కలిపే 19 రోడ్ల మరమ్మతు పనులకు రూ.34.27 కోట్ల నాబార్డు నిధులను, నియోజకవర్గ పరిధిలోని 4 స్టేట్ హైవే రోడ్లకు రూ.19.08 కోట్లను కేటాయించారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో కంకర తేలి, గుంతలు పడి, మట్టిగా మారిన రహదారులు.. వాహన చోదకులకు, పాదచారులకు నరకాన్ని చూపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో రూ.22 కోట్లతో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తయ్యింది.వైసీపీ హయాంలో తారు రోడ్లపైపడ్డ గుంతల పూడ్చివేతకు మరో రూ.1.28 కోట్లను వ్యయం చేశారు. సుమారు 51 కిలోమీటర్ల మేర రోడ్లపై పడ్డ గుంతలను పూడ్చే పనులు కొనసాగుతున్నాయి. ఇంత చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబుకు తృప్తి కలగలేదు.రవాణా వ్యవస్థ బాగుంటేనే ఏ ప్రాంతమైనా నిరంతరాయంగా అభివృద్ధి జరుగుతుందని ఆయన నమ్మిక. అందుకోసమే రోడ్లను అభివృద్ధి చేసేందుకు నియోజకవర్గ పరిధిలోని ఆర్ అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ఏకంగా రూ.53.27 కోట్లను మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టబోయే మొత్తం 23 రోడ్లలో 19 రోడ్లు గ్రామాలను అనుసంధానించే రోడ్లు కాగా, మిగిలిన 4 రోడ్లు స్టేట్ హైవేకు సంబంధించిన రోడ్లు. ఈ రెండు విధాలైన రోడ్లకు వేర్వేరుగా రూ.34.27, రూ.19.08 కోట్లతో పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు ఇస్తూ గత నెల 5వ తేదీన జీవో జారీ అయింది. కుప్పం- పలమనేరు రోడ్డునుంచి రాళ్లబూదుగూరు మీదుగా కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు (రూ.405 లక్షలు), కుప్పం-గుడుపల్లె రోడ్డునుంచి గుండ్లసాగరం, పొగురుపల్లెల మీదుగా కర్ణాటక సరిహద్దుకు (రూ.602 లక్షలు), కుప్పం నుంచి పెద్దపర్తికుంటకు (రూ.516లక్షలు), రామకుప్పంనుంచి విలాపురానికి (రూ.385 లక్షలు) మొదలైన 4 రోడ్లు స్టేట్ హైవేలు ఉన్నాయి. మిగిలిన 19 రోడ్లు గ్రామాలను కలుపుతూ ఉన్నవే. అధ్వానంగా ఉన్న ఈ రోడ్ల మరమ్మతు పనులకు నిధులను కేటాయించారు. త్వరలోనే టెండర్లను ఆహ్వానించి ఆయా పనులను చేపట్టనున్నారు.


అభివృద్ధి పనులు మంజూరైన కుప్పం-గుడుపల్లె రోడ్డునుంచి అగరం క్రాస్ దాకా ఉన్న రోడ్డుపై ఇటీవలే గుంతలు పూడ్చి వేసిన ప్యాచ్‌లు


అభివృద్ధి పనులకు నోచుకున్న కుప్పం-పలమనేరు రోడ్డునుంచి రాళ్ల బూదుగూరు మీదుగా కేజీఎఫ్ దాకా ఉన్న అంతర్రాష్ట్ర రహదారి

### గుంతలు పూడ్చిన రోడ్లకు కూడా

కుప్పం నియోజకవర్గంలోని గ్రామాలను కలిపే రోడ్లు, స్టేట్ హైవేల అభివృద్ధికి నిధులు మంజూరవడం, త్వరలోనే టెండర్లు జరిగి ఆయా రోడ్ల పనులు ప్రారంభం కావడం బాగానేవుంది. అయితే ఈ 23 రోడ్లలో కొన్నింటికి ఇటీవలే తాత్కాలిక మరమ్మతులు జరిగాయి. రోడ్లపై గుంతలుపడి దారుణంగా ఉన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులకోసం కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే రూ.1.28 కోట్లు మంజూరు చేసింది. ఆయా రోడ్లపైపడ్డ గుంతలు కూడా ఈ నిధులతో పూడుస్తున్నారు. ఈ పనులు దాదాపు ముప్పావు వంతు పూర్తయ్యాయి. అయితే ఈ గుంతలు పూడ్చిన రోడ్లలోనే కొన్నిరోడ్ల అభివృద్ధికి ఇప్పుడు నిధులు మంజూరు కావడం విశేషం. ఉదాహరణకు కుప్పం-గుడుపల్లె రోడ్డు నుంచి అగరం క్రాస్ దాకా ఉన్న రోడ్డును రూ.80 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. అయితే ఈ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి ఇటీవలే మరమ్మతు చేశారు. అలాగే రూ.1.85 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరైన గడ్డూరు నుంచి కెనమాకులపల్లె, పెద్దూరుల మీదుగా కర్ణాటక సరిహద్దు దాకా మంజూరైన రోడ్డుపై ఉన్న గుంతలను కూడా ఇటీవలే పూడ్చారు. ఈ రెండు పనులే కాక, కొత్తగా అభివృద్ధి పనులు మంజూరైన మరికొన్ని రోడ్లపైపడ్డ గుంతల పూడ్చివేత పనులు రెండుమూడు నెలల క్రితం మంజూరైన రూ.1.28 నిధులతో పూర్తి చేశారు.అధికారులు ఇటువంటివన్నీ ఆలోచించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే బావుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

### అడిగిన రోడ్లు ఇవ్వలేదని టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తి

కుప్పం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరైనా, త్వరలోనే ఆయా పనులు ప్రారంభం కానున్నా సరే, టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొంది. తారు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని, ఏయే రోడ్లు కావాలో జాబితాలు ఇవ్వాలని సుమారు రెండు నెలల క్రితం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మండల పార్టీ నాయకులనుంచి జాబితాలు తీసుకున్నారు. తీరా జీవోలో వచ్చిన జాబితాలో వారు సూచించిన రోడ్లు లేకపోవడంతో హతాశులయ్యారు. ఫలానా రోడ్డు జాబితాలో పెట్టామని, ఆ రోడ్డు తప్పకుండా అభివృద్ధి అవుతుందని ప్రజలకు, పార్టీ శ్రేణులకు చెప్పిన తర్వాత, వేరే జాబితా రావడం తమకు జరిగిన అవమానంగా నాయకులు భావిస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ దస్తగిరిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. బాగా పాడైన రోడ్లనే అభివృద్ధి పనులకు ప్రతిపాదించామని చెప్పారు. అయినా ఇప్పుడు మంజూరైన రోడ్ల జాబితా ఇప్పటిది కాదన్నారు. జూన్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక జరిగిన పర్యటన సందర్భంగా తయారైందని వివరించారు.

### నూనె గింజల సాగుకు ప్రణాళికలు
# సిద్ధం చేయండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తీర్ణం, ఉత్పత్తి, దిగుబడి లక్ష్యాల ఆధారంగా నూనె గింజల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డిస్ట్రిక్ట్ ఆయిల్ సీడ్ మిషన్ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళిక రూపొందించేందులో భాగంగా మండలాలవారీగా క్షేత్రస్థాయిలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌ను భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నూనెగింజల పంటలో మొదటి స్థానంలో వేరుశనగ ఉండగా.. తర్వాత పొద్దుతిరుగుడు ఉందని వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, నాబార్డు డీడీఎం సునీల్, వ్యవసాయ శాఖ ఏడీ సావిత్రి, డీటీవో రామచంద్ర, ఏడీఏ విజయశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**పీ-4పై అభిప్రాయాలు తెలియజేయండి**

సమగ్రాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2024లో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్‌లతో కలిసి కలెక్టర్ పీ-4కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీ-4 విధానంపై వెబ్‌సైట్/క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను ఈనెల 25వ తేదీలోగా తెలియజేయాలని కోరారు.

## చిత్తూరు షుగర్స్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ విద్యాధరిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీవరకు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు. లేదంటే కోర్టు వివాదాలు పూర్తయి ప్రభుత్వ ఆదేశాల మేరకు లిక్విడేటర్ బాధ్యతలు తీసుకునేవరకు కొనసాగాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఒంటరి ఏనుగు హల్‌చల్

గుడిపాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల పరిధిలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో వున్న ఎంసీఆర్ క్రాస్ వద్ద సోమవారం రాత్రి ఓ ఏనుగు హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. సమాచారమందుకున్న అటవీశాఖ బీట్ అధికారులు ఢిల్లీరాణి, అరుణ, సతీష్, జబీఅల్లా టపాసులు కాలుస్తూ ఆ ఏనుగును తమిళనాడు అటవీప్రాంతానికి తరలించేందుకు చర్యలు చేపట్టారు.దీంతో ఆ ఏనుగు బొమ్మసముద్రం అడవి వైపు వెళ్లింది.


ఏనుగు కోసం గాలిస్తున్న డీఆర్వో థామస్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి

## రాత్రి సమయాల్లో పొలాల వద్దకు వెళ్ళకండి

### యాదమరి - బంగారుపాళ్యం సరిహద్దులో 25 ఏనుగులు సంచారం

### వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి సంకేత్ గరుడ్

యాదమరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) :యాదమరి - బంగారుపాళ్యం సరిహద్దుల్లో దాదాపు 25 ఏనుగులు మూడు గుంపులుగా సంచరిస్తున్నందున అటవీ సమీప గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి సంకేత్ గరుడ్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ 19 ఏనుగులు ఒక గుంపుగా తిరుగుతున్నాయని, వాటిలో ఐదు గున్నలు నుంజర్ల ప్రాంతంలో, మూడు మరో వైపు, రెండు మరో వైపు, ఒంటరిగా ఒక ఏనుగు మొగిలి వెంకటగిరి, బోడబండ్ల, రాగిమానుపెంటకు 50 కి.మీ. అటవీ రేంజ్ పరిధిలో ఆవాసంగా చేసుకున్నాయని, ఇక్కడ వాటికి కావాల్సిన ఆహారం, నీరు పుష్కలంగా దొరుకుతున్నాయన్నారు.అటవీ సమీప గ్రామాల రైతులు రాత్రివేళల్లో అడవిలోకి వెళ్ళకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.అటవీ సిబ్బంది ఈ ఏనుగుల మందను అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.గత రాత్రి ఏనుగు దాడిలో గాయపడ్డ వ్యక్తికి చికిత్సకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏనుగుల దాడిలో పంటపొలాలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్వో ఆనంద రెడ్డి, ఎంవీ గిరి, సెక్షన్ ఆఫీసర్ మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి సంకేత్ గరుడ్ తదితరులు

### అధ్యక్షా..

# దళిత ద్రోహి జగన్



గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో ఎస్సీల కోసం దాదాపు 27 పథకాలు ప్రవేశ పెట్టారు.నాలాంటి ఎంతో మంది పేద ఎస్సీ విద్యార్థులు ఈ స్కీముల సాయంతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగారు.ఈ 27 పథకాలను రద్దు చేసి ఎస్సీల కడుపుకొట్టిన జగన్‌రెడ్డి ఒక దళిత ద్రోహి.మా ఎస్సీలు, మా బీసీలు అంటాడే కానీ ఆయన హయాంలోనే దాదాపు 200మందికి పైగా ఎస్సీలపై దాడులు జరిగాయి. ఇదంతా చూసిన మా ఎస్సీలందరూ షాక్‌కు గురయ్యాం. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా మరెక్కడైనా ఉన్నామా అనిపించింది.పైగా గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు బడ్జెట్‌లో రూ.40252 కోట్లు కేటాయిస్తే జగన్ ప్రభుత్వ హయాంలో రూ.20వేల కోట్లు అంటే దాదాపు యాభై శాతం తగ్గించేశారు.దీని ఫలితంగా ఇంకోసారి జగన్ ప్రభుత్వం రాకూడదని మా ఎస్సీలంతా కలిసికట్టుగా ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నాం.మన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే 2024-25వ సంవత్సరానికి దాదాపు రూ.18,497 కోట్లు, 2025-26వ సంవత్సరానికి రూ.20281 కోట్లు కేటాయించారు. ఇది మన కూటమి ప్రభుత్వానికి ఎస్సీలపై ఉండే అభిమానం,ఎస్సీలకు అన్ని విధాలా అండగా మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబుకు నా ప్రత్యేక ధన్యవాదాలు.

- వీఎం థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే



## రంజాన్ వేళలు


ఇఫ్తార్ (మంగళవారం) : 6.28
సహరి (బుధవారం) : 5.03





## తెప్పపై రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో రెండవరోజు సోమవారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య విద్యుద్దీపాలంకరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్పపై ఆశీనులై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో తెప్పోత్సవం కనులపండువగా జరిగింది.


సోమవారం పగలంతా భగభగమన్న సూరీడు సాయంత్రం చల్లని గాలుల నడుమ అస్తమిస్తున్న ఈ సుందర దృశ్యం చిత్తూరులోని గిరింపేట చెంగల్రాయకొండ వద్ద దర్శనమిచ్చింది.



## బాలాజీనగర్‌లో ఆరడుగుల నాగుపాము

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల బాలాజీనగర్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన నాగుపామును సోమవారం భాస్కర్ నాయుడు పట్టుకున్నారు. ఆరు అడుగుల పొడవున్న ఆ పామును అడవిలో వదిలి పెట్టారు.

## శ్రీవారిసేవలో ప్రముఖులు



మంత్రి నారాయణ - కోనా రఘుపతి - థీరకైత్ జేరియస్సెట్టసిన్ - ఎం రామరాజు

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ ఎం రామరాజు, కోనా రఘుపతి, థాయ్-భారత్ కల్చరల్ లాడ్జ్ చైర్మన్, థాయిలాండ్ మాజీ మంత్రి తీరకైత్ జేరియస్సెట్టసిన్ ఉన్నారు.

## సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.05 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,478

తలనీలాలు సమర్పించినవారు: 26,667





# పాటను మిగిల్చి వెళ్లిపోయావా...!

### కన్నీరు మున్నీరవుతున్న గరిమెళ్ల శిష్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్షరానికి రాగం నేర్పినవాడు. సంగీతాన్ని సరళం చేసి అందరికీ అందించినవాడు. గాయకుడు, కవి, సంగీత స్రష్ట అయిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ హఠాన్మరణం ఆయన అభిమానులను దిగ్భ్రాంతి పరచగా, శిష్యులను దుఃఖంలో ముంచెత్తుతోంది. ఆయనతో కలిసి పాడినవారు, ఆయన కచేరీలకు వాయిద్య సహకారం అందించినవారు, ఆయన తీర్చిదిద్దిన సంగీత కళాకారులు ఎందరో గాజు పెట్టెలో నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉన్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.



### వైకుంఠంలోనూ అన్నమయ్య కీర్తన



ఆయనంటేనే సంగీతం. అన్నమయ్య పాట- బాలకృష్ణుని నోట అన్నట్టుగా వారి సంకీర్తనా యజ్ఞం సాగింది. నేదునూరి, పినాకపాణి, రాళ్లపల్లె, శ్రీనివాసరావు, మల్లిక్ స్వరపరిచిన కీర్తనలను కూడా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అపర అన్నమయ్యగా పేరొందిన గరిమెళ్ల సంగీతాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ 47 ఏళ్లుగా విన్నారు. ఇంతకంటే గరిమెళ్లకు భాగ్యం ఏం కావాలి. వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడి చెంత అన్నమయ్య కీర్తనలు వినిపించడానికి వెళుతున్నారని అనిపిస్తూ ఉంది. నా వంటి శిష్యులు ఒక్క కన్నీటి చుక్క తప్ప ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.

\- చిన్నమదేవి, శిష్యురాలు

### అక్షరాన్ని రాగయుక్తం పలకడం నేర్పారు



మొదటిసారి టీటీడీ తెచ్చిన 'వెంకటాద్రి వెన్నెల' అనే క్యాసెట్‌లో గరిమెళ్ల వారి గొంతు విన్నాను. ఈ తర్వాత వెన్నెలలో ఆ గొంతు నన్ను వెంటాడింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించే సంకీర్తన స్కాలర్‌షిప్ కోర్సులో 1999-2001 మధ్య వారి దగ్గర అన్నమాచార్య సంకీర్తనలు నేర్చుకునే అదృష్టం దక్కింది. ఇలా వారితో అనుబంధం ఏర్పడింది. నేదునూరి, మంగళంపల్లె ఇద్దరి సంగీతంలోని లాలిత్యం గరిమెళ్ల స్వరం. గణపతి, ఆంజనేయ, నవగ్రహ సంకీర్తనలు రాసి పాడారు. అయితే, ఒక అక్షరాన్ని ఎలా రాగయుక్తంగా పలకాలో వారి నుంచీ నేర్చుకున్నాను. జీవితంలో మరువలేని సంగీత గురువు గరిమెళ్ల.

\- కె.సరస్వతి ప్రసాద్, గాయకుడు

### ఆయన బాణీలకు వాద్య సహకారం గొప్ప జ్ఞాపకం



నా చిన్నప్పటి నుంచీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌తో మా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. వారి అనేక సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించాను. గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ రూపొందించిన కొత్త బాణీలకు వాద్య సహకారం అందించడం గొప్ప జ్ఞాపకం. స్వతహాగా గరిమెళ్ల మృదంగ విద్వాంసులు కావడంతో వారి స్వర రచన కూడా చాలా గమ్మత్తుగా ఉంటుంది. వారి సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నాను.

\- పారుపల్లె బాలసుబ్రమణ్యం, ఆకాశవాణి ఏ- గ్రేడ్ మృదంగ విద్వాంసుడు

### గాయనిగా తీర్చిదిద్దిన అన్న



ముప్పై కొత్త రాగాలను సృష్టించారు. గరిమెళ్ల చేసిన ఈ సంగీత కృషికి వెల కట్టలేం. శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు పాడిన కీర్తనలను, నవగ్రహ కీర్తనలను అందరూ పాడుకునే విధంగా సరళం చేసి పాడారు. పాతికేళ్ల వయసులోనే సంగీత, సాహిత్యంతో కూడిన పుస్తకం రాశారు. వెంకయ్య స్వామి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వారిపై సంకీర్తనలు కొత్తగా రాశారు. వారితో నాకు 46 ఏళ్ల పరిచయం. వారి చెల్లెలు వారి దగ్గర లేదు. మా అన్న నా దగ్గర లేరు. ఇందువల్ల ఇద్దరం అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని పంచుకున్నాం. సంగీతంలోని మెలకువలు నేర్పి నన్ను గాయనిగా తీర్చిదిద్దారు.

\- ఎన్‌సీ శ్రీదేవి, ప్రముఖ గాయని

## దూరవిద్యా పరీక్షలు వెంటనే నిర్వహించండి

● ఎస్వీయూ అధికారులకు హైకోర్టు ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలను వెంటనే నిర్వహించాలని ఆ వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. 2021వ సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు 2024 లోపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, యూనివర్సిటీ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకూ పరీక్షలు నిర్వహించలేదు. ఈ ఏడాది జనవరి 2 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఆ తర్వాత ఎలాంటి కారణం లేకుండా పరీక్షలను వాయిదా వేశారు. అనంతరం ఫిబ్రవరి 3 నుంచీ పరీక్షలు నిర్వహిస్తామని హాల్‌టికెట్లు కూడా జారీ చేసినా.. మళ్లీ వాయిదా వేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 24 నుంచి రాష్ట్రంలోని 46 ప్రభుత్వ గుర్తింపుగల కాలేజీల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా మూడోసారి పరీక్షలను వాయిదా వేశారు. దీనిపై దూరవిద్యా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మార్చి 17 నుంచీ పరీక్షలు నిర్వహించాలని గత వారం హైకోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ 10వ తరగతి పరీక్షల కారణంగా ఈ నెల 17 నుంచి పరీక్షలు నిర్వహించలేమని నాలుగోసారి దూరవిద్యా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 నాటికి ముగియనున్నారు. దీంతో ఏప్రిల్ 2వ తేది తర్వాత 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎస్వీయూ ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది.

### ఇప్పటికైనా పరీక్షలు జరిగేనా?

ఎస్వీయూ దూరవిద్యా విభాగంలో గతేడాదిగా పరీక్షలు పదే పదే వాయిదా పడుతున్నాయి. ఈ పరీక్షల కోసం సుమారు 32 వేల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నట్టు అంచనా. ఈ పరీక్షలకు ఇప్పటికే రూ.8 కోట్ల వరకూ ఫీజుల రూపంలో యూనివర్సిటీకి అందినట్టు తెలుస్తోంది. గతేడాది మార్చిలో పరీక్షా ఫీజు చెల్లించినా ఇంకా పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ విలువైన కాలాన్ని కోల్పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పరీక్షలను నిర్వహించాలని కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికైనా ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు జరిగేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## అత్త హత్య కేసులో అల్లుడి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వివిధ వ్యసనాలతో బాధపడుతూ డబ్బు కోసం అత్తను హత్య చేసిన రవీంద్ర నాయక్‌ను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీలత తెలిపిన ప్రకారం.. నగరంలోని చిన్నగుంటలో కాపురమున్న గోపాల్‌రెడ్డి భార్య ప్రమీల పాచి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నెల ఏడో తేది మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సమయంలో ఆమె అల్లుడు రవీంద్ర నాయక్ డబ్బులు కావాలని డిమాండు చేశాడు. తనవద్ద లేదని ఆమె చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆగ్రహించిన అతడు ఆమె చేతులు కట్టి, కాళ్లతో తన్ని, చేతులతో గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో గాలించారు. తిరుపతిలోని వేదిక్ వర్సిటీ వద్ద నిందితుడు ఉన్నట్లు అతడి మొబైల్ నెట్ వర్కు ఆధారంగా సోమవారం పోలీసులు గుర్తించి వెళ్లారు. పోలీసులను చూసిన నిందితుడు పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ మురళీమోహన్, ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్ళు రమేష్, తిలక్ కుమార్‌లను డీఎస్పీ శ్రీలత అభినందించారు.

## సుందరంగా ముక్కంటి ఆలయ పైకప్పు

### రూ.5 కోట్లతో స్వచ్ఛందంగా లీకేజీ పనులు పూర్తి చేసిన పుణె భక్తులు



శ్రీకాళహస్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పుణెకు చెందిన వెంకటేశ్వర హేచరీస్ సంస్థ అధినేత వెంకటేశ్వరరావు సొంతనిధులతో ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ పనులను పూర్తి చేశారు. అత్యంత పురాతనమైన విధానంతో ప్రకృతి వనరులను ఉపయోగించి 8 నెలల పాటు సుదీర్ఘంగా శ్రమించిన కార్మికులు ఎట్టకేలకు లీకేజీలను అరికట్టడంతో పాటు సుందరంగా, పటిష్ఠంగా రూపొందించారు. కొన్ని సంవత్సరాల నుంచి ముక్కంటి ఆలయ పైభాగంలో లీకేజీలు చోటుచేసుకున్నాయి. 2019 నుంచి వర్షాలు అధికంగా పడటంతో పైకప్పు నుంచి స్వామిఅమ్మవార్ల గర్భాలయాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వర్షపునీరు చేరేది. మైసూరులోని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ముక్కంటి ఆలయాన్ని మూడేళ్ల క్రితం దర్శించారు. ఆ సమయంలో పైకప్పు లీకేజీలను గమనించిన ఆయన పుణెకు చెందిన వ్యాపారవేత్త వెంకటేశ్వరరావును సంప్రదించారు. మరమ్మతులు చేసేలా కోరారు. దాంతో దాత ముక్కంటి ఆలయ, దేవదాయశాఖ అధికారులను సంప్రదించారు. పుణెకు చెందిన ఐఐటీ నిపుణుల బృందంతో ఆలయ పైకప్పుపై పలు దఫాలు అధ్యయనం చేయించారు. గతేడాది జూలైలో పనులను ప్రారంభించారు. సున్నం, కరక్కాయపొడి, బెల్లం, బెండకాయల జిగురు, జనపనార, మినపప్పు, అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న చెట్ల నుంచి వెలువడే జిగురు, మట్టితో తయారు చేసిన ఇటుకల పొడిని సమపాళల్లో మిశ్రమంగా చేసి పైకప్పుకు మరమ్మతులు చేపట్టారు. మొత్తం 8 నెలల పాటు నిపుణుల బృందం పర్యవేక్షణలో పుణె నుంచి వచ్చిన కార్మికులు శ్రమించారు. 60వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.5కోట్లతో మరమ్మతులు నిర్వహించారు. తుది దశలో పైకప్పుపై మట్టిపెంకుల అద్దకంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఎట్టకేలకు సోమవారం పైకప్పు లీకేజీ పనులను పూర్తిచేసి ఆలయ అధికారులకు అప్పగించారు. తాము విజ్ఞప్తి చేయడం ద్వారా పుణెకు చెందిన దాత స్వచ్ఛందంగా సేవలందించారంటూ తిరుపతి ఎంపీ గురుమూర్తి ఓ ప్రకటనలో ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.




సిద్ధేశ్వరస్వామికి హారతి - పెద్ద దేవరకు సిద్ధమవుతున్న హోమ సామగ్రి

# 14న సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర వేడుక

### ● 9 ఏళ్ల తరువాత కురబ కులస్తుల కూడిక



పుష్పాలంకరణలో సిద్ధేశ్వరస్వామి

కుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కురబల కులదైవం సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవరకు శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ, కదిరిముత్తనపల్లె సిద్ధమవుతోంది. కుప్పం నియోజకవర్గంలో కురబ సామాజికవర్గం జనాభా అధికం.వీరికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రత్యేకమైన ఆలయాలున్నాయి. సిద్ధేశ్వర స్వామి, బీగేశ్వర స్వామి, బత్తేశ్వర స్వామి, రేవణ సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశ్వరస్వామి వీరి ప్రధాన కుల దైవాలు, వీరు పెద్ద దేవర అని పిలిచే సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాన్ని 9, 12, 14 ఏళ్లకు ఒకసారి మాత్రమే జరుపుకుంటారు. ప్రస్తుతం కదిరిముత్తనపల్లెలో సిద్ధేశ్వరస్వామి వారి పెద్ద దేవర మహోత్సవ ఉత్సాహం కదం తొక్కుతోంది.సోమవారం పెద్ద దేవరకు అంకురార్పణ జరిగింది. 11వ తేదీన కలశ స్థాపన, గాయత్రి హోమం తదితర హోమాలు, 12న రుద్రాభిషేకం, రుద్ర హోమాలు నిర్వహిస్తారు. 13, 14 తేదీల్లో పెద్ద దేవర విశేషంగా జరుగుతుంది. 13వ తేదీ ఉదయం తమటయెద్దు పూజ, పంచామృతాభిషేకం, హరికథాకాలక్షేపం, రాత్రి రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుంది. ఈ రోజు సాయంత్రానికే కురబ కులస్తులు మూడు నాలుగు లక్షల మంది పెద్ద దేవరకు కదిరిముత్తనపల్లె చేరిపోతారు.ఆడబిడ్డలకు నగలు, పెద్దలకు బట్టలు పెట్టుకుంటాయి కుటుంబాలు, నాగుల పూజ చేస్తారు. పెద్దలమీద గౌరవంతో కాకపోయినా కుల దైవాల మీద భక్తితో కూడిన భయంతో కుటుంబాలన్నీ ఈ ఉత్సవంలో కలిసి సంబరాలు జరుపుకుంటాయి. పెద్ద దేవర ఉత్సవంలో ప్రధాన ఘట్టం భక్తులు తమ తలలపై టెంకాయలు పగులగొట్టుకోవడం. కురబ కులస్తులు పెద్ద దేవర ఉత్సవంలో తలలమీద టెంకాయలు పగులగొట్టుకుని స్వామివారికి మొక్కులు తీర్చుకుంటారు.

### ● విస్తృత ఏర్పాట్లు



నిర్వాహకుడు చంద్రశేఖర్

9 ఏళ్ల తర్వాత జరుగుతున్న పెద్ద దేవరకు సుమారు 3 లక్షల నుంచి 4 లక్షల దాకా జనం వచ్చే అవకాశం ఉన్నదని ఆలయ ధర్మకర్త మునిరత్నం గౌడ్, నిర్వాహకుడు చంద్రశేఖర్ చెప్పారు.ఆంధ్రా,కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి కురబ కులస్తులే కాకుండా, ఇతర కులాలకు చెందిన వారు కూడా పెద్ద దేవరలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకోవడానికి పెద్దయెత్తున తరలి రానున్నారు. ఇలా రావాలని నిర్ణయించుకున్న కుటుంబాలు ఇప్పటికే చదును చేసి సిద్ధంగా ఉంచిన భూమిలో తమ గ్రామానికి లేదా, కుటుంబానికి స్థలాన్ని ఎంపిక చేసుకుని, అక్కడ సంబంధిత బ్యానర్లు పెట్టాయి. ఇంకొందరు షెడ్లు కూడా నిర్మించుకుంటున్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ పెద్ద దేవర ఏర్పాట్లకు సంబంధించి కురబ కుల పెద్దలతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు. ఆయన ఆదేశాల మేరకు సుమారు వంద కరెంటు స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు తాత్కాలిక పద్ధతిన ఆలయంనుంచి సుమారు అయిదు కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్నారు. కేవలం పెద్ద దేవర ఉత్సవ ఏర్పాట్లకు ప్రభుత్వం తరఫున సుమారు రూ.10 లక్షలనుంచి రూ.12 లక్షల దాకా వ్యయం అవుతుందని అధికార వర్గాలు అంచనా వేశాయి. ఆయా ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.

## ముగ్గురు రుయా విద్యుత్తు సిబ్బందికి మెమోలు

తిరుపతి(వైద్యం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న రుయా విద్యుత్తు విభాగంలోని ముగ్గురు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. వారం రోజుల పాటు జీతంలో కోత విధించారు. ఈ మేరకు రుయా సూపరింటెండెంట్ రవిప్రభు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిలో ఆదివారం విద్యుత్తు సరఫరాలో చోటుచేసుకున్న అంతరాయానికి సంబంధించి 'రుయాలో గంట పాటు అంధకారం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, డీఎంఈ నరసింహం, కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీనిపై సూపరింటెండెంట్ తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి విచారించారు. తాత్కాలికంగా సరఫరా ఆపుతున్నట్లు ఆ శాఖ అధికారులు సిబ్బందికి సమాచారం ఇచ్చినా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. విద్యుత్తు లేని సమయంలో చిన్నపిల్లల వార్డులో ఎలాంటి మరణాలు జరగలేదని, రోజువారీగా ఉండే సాధారణ మరణాలే చోటుచేసుకున్నాయన్నారు. ఐసీయూ, ఏఎంసీ, అత్యవసర విభాగంలోని కొన్ని వెంటిలేటర్లకు.. చిన్నపిల్లల వార్డులోనూ ఎస్ఐసీయూ, ఐసీయూ వార్డులో గంటపాటు పనిచేసేలా ఇన్వర్టర్లు ఉన్నాయన్నారు. పాత జనరేటర్ స్థానంలో కొత్తదానిని రూ.15 లక్షలతో కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం అప్రమత్తంగా ఉండటంతో ప్రాణనష్టం ఏమీ జరగలేదని మరికొంత ఆలస్యం చేసుంటే ఊహించలేని పరిస్థితి చోటుచేసుకునేదని ఆయన వివరించారు. ఇకపై విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా తగు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇంటిదోవ తప్పదని హెచ్చరించారు.



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

## 'వేదము' వెబ్‌సైట్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని సాంకేతీకరించాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పది రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌తో పాటు 'వేదము.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. వెబ్‌సైట్ ద్వారా వేద విజ్ఞాన వ్యాప్తికి అవకాశం కలుగుతుందన్నారు. సత్యసాయి వేద సంస్థ ప్రతినిధి పరమహంసులు, మాజీ రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్‌శుక్లా, అద్వైత వేదాంత విభాగ హెడ్ గణపతిభట్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## చుడా అభివృద్ధికి సహకరించండి: చైర్‌పర్సన్



సమావేశంలో ప్రసంగిస్తున్న కటారి హేమలత

చిత్తూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చుడా అభివృద్ధికి సహకరించాలని చైర్‌పర్సన్ కటారి హేమలత కోరారు. సోమవారం చుడా కార్యాలయంలో ఎల్‌టీపీ (ల్యాండ్ టెక్నికల్ పర్సన్స్)తో ఆమె సమావేశం నిర్వహించారు. కొంత మంది ఇంజనీర్లు తమ వద్దకు వచ్చే అర్జీదారులకు తప్పుదోవ పట్టించేలా సలహాలు ఇస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బిల్డింగ్, లేఅవుట్ రూల్స్ సవరించి సులభతరం చేశారని తెలిపారు. వీటిని అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్, లేఅవుట్ అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు.

## 'పీఆర్ క్లాస్-4 ఎంప్లాయీస్' నూతన కమిటీ



రవికుమార్ నాయుడికి వినతి పత్రం అందజేస్తున్న నూతన కమిటీ నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పీఆర్ క్లాస్-4 ఎంప్లాయీస్ సెంట్రల్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైందని రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా సురేంద్రబాబు, కార్యదర్శిగా మోహన్, అసోసియేట్ అధ్యక్షుడిగా చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా అర్జునయ్య, రాజేష్, చంద్రనాయక్, సంయుక్త కార్యదర్శులుగా గణేష్‌బాబు, నవీన్‌సాయి, ప్రదీప్‌కుమార్, కోశాధికారిగా పృథ్వీరాజ్, కో-ఆప్షన్ మెంబర్లుగా అమన్, ఆనంద్ ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా యోగేష్‌బాబు, మధు, లేడీ రెప్రజెంటేటివ్‌గా సుజాత, ఈసీ మెంబర్లుగా రోజ, గిరీష్, సంకుంతల, వంశీకృష్ణ, పొన్నుస్వామి, శ్యామ్‌ప్రసాద్‌లు ఎంపికయ్యారు. వీరంతా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడిని కలిసి తమ సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు.

## కర్ణాటకలో నగరివాసి చోరీ

### నిందితుడి అరెస్టు - రూ.30లక్షల స్వాధీనం



నగరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని రాజుకుప్పం గ్రామానికి చెందిన జగదీష్ కర్ణాటక రాష్ట్రంలో చోరీ చేసి స్వగ్రామానికి వచ్చేశాడు.అయితే కర్ణాటక పోలీసులు మూడు రోజులుగా వెతికి జగదీష్‌ను నగదుతో పాటు పట్టుకున్నారు.నగరి డీఎస్పీ అజిత్ కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రానికి చెందిన హవేరిలో రూ.30 లక్షల నగదును జగదీష్ చోరీ చేశాడు.దర్యాప్తులో భాగంగా కర్ణాటక పోలీసులు నగరిలో జగదీష్ వున్నట్లు తెలుసుకున్నారు.నగరికి చేరుకుని స్థానిక పోలీసుల సాయంతో మూడు రోజులుగా మాటువేసి జగదీష్‌ను పట్టుకున్నారు.జగదీష్‌ను కర్ణాటక పోలీసులకు అప్పగించినట్లు డీఎస్పీ చెప్పారు.

## రూ.3 లక్షల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో పాటు నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్; మార్చి 10(ఆంధ్రజ్యోతి):గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రూ. 3 లక్షల విలువ చేసే 8 కేజీల గంజాయిని ఒకటవ పట్టణ పోలీసులు సీజ్ చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు...సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మిట్టూరులో మణిగండన్(42) అనే వ్యక్తి అనుమానాస్పద రీతిలో తచ్చాడుతుండగా అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుంచి రూ. 3 లక్షల విలువ చేసే 8కేజీల 125 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. ఇచ్ఛాపురం నుంచి గంజాయిని తీసుకొచ్చి చిత్తూరులో అమ్మేవాడని విచారణలో తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## వెటర్నరీ విద్యార్థుల నిరసన

తిరుపతి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. దీనిలో భాగంగా విద్యార్థులు ఎంఆర్‌పల్లె సమీపంలోని వెస్ట్‌చర్చికి చేరుకుని తమ సమస్య త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ప్రార్థనలు చేశారు. తిరిగి వర్సిటీకి చేరుకుని దీక్షాశిబిరంలో బైఠాయించి నిరసన కొనసాగించారు. అధికారులు, పాలకులు ఆలకించి న్యాయం చేయాలని కోరారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన



తిరుపతి(ఆర్టీసీ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈపీఎస్-95 పెన్షన్ పెంచాలని, సామాజి క పెన్షన్ మాదిరిగా ఇవ్వాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ వైద్యశాల ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ కూడలికి నుంచి తిరిగి డిస్పెన్సరీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి సహదేవరాజులు మాట్లాడుతూ ఈపీఎస్-95 ప్రకారం ఇప్పటివరకు రూ.1000 నుంచి రూ.2,300వరకు జమచేస్తున్నారన్నారు. దాంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఈవిషయంలో చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రీజినల్, డిపో నాయకులు జె.ఆర్.ఎం.నాయుడు, కె.శ్రీనివాసులు, వై.భాస్కర్‌రెడ్డి, ఎస్.శేషాద్రి, ఎం.మునికృష్ణ, డి.ఎస్.సింగ్, ఆర్.డి.రెడ్డి, ఎస్.రఫి, ఎస్.నబిసహబ్, పి.వి.రాజు, ఆర్.కేశవులు, ఎస్.శర్మ, కె.ఆర్.సి.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలే అధికం

**● కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు 167 అర్జీలు**



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు రెవెన్యూ సమస్యలే అధికంగా వచ్చాయి. మొత్తం 167 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూ శాఖకు 112 అర్జీలుంటే.. పోలీసుశాఖకు 11, డీఆర్‌డీఏకు 21, చిత్తూరు మున్సిపల్ కమిషనర్‌కు 10, మిగిలిన శాఖలకు 13 చొప్పున ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, తదితరులు స్వీకరించారు.

**ప్రధాన అర్జీలిలా..**

● సర్వే నెంబరు 193-5, 193-6సర్వే నెంబరులో 7 ఎకరాల డీకేటీ భూమిలో మూడు కుటుంబాలవారు మామిడి మొక్కలు, పంటలు చేసుకుని ఐదేళ్లుగా జీవిస్తున్నామని చౌడేపల్లె మండలం దిగువపల్లె మోట్లాపల్లె యానాది కాలనీకి చెందినవారు తెలిపారు. ఇపుడు అగ్రవర్ణాల వారు ఈ భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని వరలక్ష్మి, శారద, వెంకటలక్ష్మి కోరారు.

● సర్వే నెంబరు 130-5లో 50 సెంట్ల భూమిని 75 ఏళ్లుగా శ్మశానవాటికగా వాడుతున్నట్లు సోమల మండలం సోమలకు చెందిన పలువురు ముస్లింలు తెలిపారు. ఈ స్థలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించమని తహసీల్దార్‌కు పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు.

● నెల్లేపల్లె లెక్కదాఖలాలో సర్వే నెంబరు 768లో గుట్ట ఉందని స్థానిక రైతులు తెలిపారు. మూగజీవాలను మేపుకోవడానికి ఉన్న ఈ గుట్టను కొందరు ఆక్రమించుకుని చదును చేసి మామిడి మొక్కలను నాటారన్నారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగి అయితే కుటుంబీకుల పేరిట ఎనిమిది ఎకరాల వరకు రాసుకున్నాడన్నారు. పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విచారించి, న్యాయం చేయాలని కోరారు.

● 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని పెనుమూరు మండలం విడిదిపల్లె దళితవాడవాసులు తెలిపారు. వవెంటనే రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.



పెనుమూరు మండలం విడిదిపల్లె దళితవాడవాసులు

● అరటి, మామిడి, టమాటా వంటి పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట, కేఎం కండ్రిగ, వెలుతురుచేను, కీరమంద, కొదలమడుగు, బండ్లదొడ్డి, మొగిలివారిపల్లె రైతులు కోరారు. ఐదు నెలలుగా పంటలు ధ్వంసం చేస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని చెప్పారు. ఏనుగులు పొలాల్లోకి రాకుండా చేయాలని కోరారు.



ఏనుగుల దాడులను అరికట్టాలని కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు

● నగరి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లుకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. స్వీపర్లతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పెండింగ్ వేతనాలతోపాటు ప్రతి నెలా ఐదో తేదీన వేతనాలను, మాస్కులు, గ్లౌజులను ఇవ్వాలని కోరారు.



ఏఐటీయూసీ నేతల నిరసన

● ఇంకొకరి సాయం లేనిదే ఏ పనీ చేసుకోలేని తమ కుమార్తె (26)కు రూ.15వేల పింఛన్‌ను మంజూరు చేయాలని పెనుమూరు మండలం బొంతివంకకు చెందిన బోడేయ్య, మణిమాల కోరారు. తమ కుమార్తెకు పుట్టుకతోనే మాటలు రావని, నడవటం లేదన్నారు. ప్రస్తుతం రూ.5వేల పింఛన్ వస్తోందని, దాన్ని రూ.15వేలకు పెంచి ఇవ్వాలని కోరారు.



కుమార్తెకు తిండి పెడుతున్న తల్లి

● హిందువులపై దాడులను అరికట్టాలంటూ వీహెచ్‌పీ, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలు జరుపుకుంటున్న వారిని ముస్లింలు అడ్డుకున్నారన్నారు. ప్రశ్నించిన హిందువులపై దాడిచేసి, గాయపరిచారన్నారు. ఘర్షణను అదుపు చేయాల్సిన పోలీసులు హిందువులపై లాఠీచార్జి చేయడంతోపాటు కేసులు కూడా పెట్టారన్నారు. ప్రభుత్వం స్పందించి హిందువులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నేత రవీంద్రనాథ్, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు, జగదీశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద వీహెచ్‌పీ, బీజేపీ నేతల నిరసన

### పోలీసు కార్యాలయానికి 41 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో 41 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. సర్వే నెంబరు 130-బీ7లో 1.60 ఎకరాల భూమిలో నాటిన మామిడి మొక్కలు, పైపులైన్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన అమృతవల్లి కోరారు. భూతగాదాలపై 14, డబ్బుతగాదాలపై 6, భర్త వేధింపులపై 5, కుటుంబ తగాదాలపై 5, ఇంటి తగాదాలపై 5, చీటింగ్‌పై 4, ఆస్తి తగాదాలపై 2చొప్పున అర్జీలు అందాయి.

### అదనపు విద్యుత్ లోడ్‌ను

# క్రమబద్ధీకరించుకోండి

**● జూన్ 30 వరకు 50 శాతం రాయితీ ఇస్తున్నారు ● అధికారులు గుర్తిస్తే మాత్రం జరిమానా తప్పదు**

● చిత్తూరు నగరానికి చెందిన మహేష్ చిరుద్యోగి. ఇతని ఇంటికి నెలకు రూ.800 విద్యుత్తు బిల్లు వస్తోంది. వేసవి కావడంతో ఇటీవల ఏసీ ఏర్పాటు చేసుకున్నారు. తనిఖీలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించగా.. అదనపు లోడ్ వాడుతున్నారని డెవలప్‌మెంటు చార్జీలతోపాటు అపరాధ రుసుం విధించారు.

● పూతలపట్టు మండలంలో సుబ్రహ్మణ్యం కూలి పనులు చేస్తుంటాడు. ఇతనికి ప్రతి నెలా రూ.500 విద్యుత్ బిల్లు వస్తోంది. పిల్లలు ఎండలను తట్టుకోలేక ఇబ్బంది పడుతుంటే.. నెల కిందట ఇంటికి ఏసీ ఏర్పాటు చేసుకున్నాడు. అదనపు లోడ్ వాడుతున్నారని విద్యుత్ శాఖ అధికారులు డెవలప్‌మెంటు చార్జీలతోపాటు ఫైన్ విధించారు.

● జిల్లాలోని గృహ వినియోగదారులు: 4,62,000
● 3 కేవీలోపు వాడేవారు : 4,42,050
● 3 కేవీపైన వాడేవారు : 19,950

చిత్తూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏటా వేసవిలో అధిక శాతం వినియోగదారులు ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. ఇటువంటి ఇబ్బందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గృహ వినియోగదారులకు 50శాతం రాయితీ ఇస్తోంది. ఈనెల ఒకటో తేదీనుంచే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో లైట్లు, ఫ్యాన్లు తదితరవాటి వినియోగాన్ని అంచనావేసి.. లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంటు చార్జీలు చెల్లిస్తారు. అధిక శాతం మంది దరఖాస్తులో రెండు, మూడు కిలోవాట్లకు అనుమతి తీసుకుంటారు. ఈలెక్క ప్రకారమే అధికారులు ఆప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు. తర్వాత గృహ యజమానులు ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గీజర్లు వంటివి ఏర్పాటు చేసుకున్నా.. అందుకు అనుగుణంగా చార్జీలు చెల్లించరు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతోపాటు లోఓల్టేజీ సమస్యలు వస్తున్నాయి. లో ఓల్టేజీ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అధికారులు తనిఖీ చేసినప్పుడు తీసుకున్న లోడు దాటి గృహోపకరణాలు వినియోగిస్తున్నారా లేదా అని పరిశీలిస్తారు. అదనపు లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే.. జరిమానా విధిస్తారు.

**జూన్ నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ**

వినియోగదారుడు స్వచ్ఛందంగా ముందుకొస్తే కేవలం రుసుంలో సగం రాయితీగా ఇస్తారు. జూన్ 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంది. ఆ తర్వాత సిబ్బంది తనిఖీలు చేసి గుర్తిస్తే మాత్రం జరిమానా తప్పదు.



విద్యుత్ మీటర్లు

**సద్వినియోగం చేసుకోండి**



కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంటు చార్జీగా రూ.2వేలను నిర్ణయించారు. జూన్ నెలాఖరులోపైతే దీనికి 50శాతం రాయితీ ఉండటంతో రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుంది. దరఖాస్తు ఫీజు రూ.50. మీసేవ, సచివాలయంతోపాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్‌ఈ

## బోయకొండ గంగమ్మకు రూ.2.95 కోట్ల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి వేలం పాటల ద్వారా రూ.2.95 కోట్ల ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం వెల్లడించారు. సోమ వారం కొండపై ఉన్న ఆలయ కార్యాలయంలో బోయకొండలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వేలం పాటలు నిర్వహించారు. కొండపైన కొబ్బరికాయలు, పూజ సామగ్రి విక్రయించుకునే హక్కు బోయకొండకు చెందిన శివకుమార్ రూ..52. 50లక్షలకు దక్కించుకున్నారు. పూలహారాలు, నిమ్మకాయ హారాలు, వడిబాల సామగ్రి, చీరలు, జాకెట్ పీసులు విక్రయించుకునే హక్కు బోయకొండకు చెందిన గణపతి రూ.42లక్షలకు దక్కించుకున్నారు. దేవస్థానం, పంచాయతీకి చెందిన ఉమ్మడి టోల్‌గేటు నిర్వహణను జే రమణ రూ..68.50లక్షలకు పాడుకున్నారు. పెద్దభోగం, చిన్న భోగం సేకరించు కును హక్కును పెద్దూరుకు చెందిన వెంకటేష్ అలియాస్ రమణ రూ..86.15లక్షలకు దక్కించుకున్నారు. భక్తుల సమర్పించే చీరలు, రవికలు, పావడా పీసుల సేకరణ హక్కును గంగులప్ప రూ.46.50 లక్షలకు దక్కించుకున్నారు. క్లాక్ రూం, తలనీలాలు సేకరించుకునే హక్కుల వేలం పాటలు వాయిదా పడినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు, గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ సిబ్బంది, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయం నుంచి ఇద్దరు విద్యార్థుల అదృశ్యం



కార్తీక్ నాయక్, అరుణ్‌కుమార్

రామకుప్పం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. రామకుప్పం మండలం వీర్నమల తాండాకు చెందిన కార్తీక్‌నాయక్, రాజుపేటకు చెందిన అరుణ్‌కుమార్‌లు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం 8గంటలకు వారు విద్యాలయం నుంచి వెళ్లిపోయారు. ప్రిన్సిపాల్ రమేష్ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







నిర్మానుష్యంగా రాజీవ్‌గాంధీ రోడ్డు - ఎండల నుంచి రక్షణ కోసం ఇలా...

# మండుతున్న ఎండలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ఆరంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. సోమవారం జిల్లాలో అత్యధికంగా గుడిపాలలో 37.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా...తవణంపల్లెలో 36.9డిగ్రీలు, చిత్తూరులో 36, నగరిలో 35.5, ఎస్ఆర్‌పురంలో 35.1, పులిచెర్లలో 35, గుడుపల్లెలో 34.7, నింద్రలో 34, సదుంలో 33.6, బంగారుపాళ్యం, జీడీనెల్లూరులో 33.5, ఐరాల, చౌడేపల్లె, పాలసముద్రం, విజయపురంలో 33.2, శాంతిపురంలో 33.1,పెనుమూరులో 33, వెదురుకుప్పంలో 33, రొంపిచెర్లలో 32.8, సోమల,వి.కోటలో 32.7, కార్వేటినగరం,యాదమరిలో 32.6, పూతలపట్టులో 32.5, పెద్దపంజాణిలో 31.7, గంగవరంలో 31.2,కుప్పంలో 31.1, పలమనేరులో31.1, రామకుప్పంలో30.8, బైరెడ్డిపల్లెలో 30.6, పుంగనూరులో 30.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## రుయా మీదుగా ఇక మరిన్ని బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల-వేలూరు మధ్య మరిన్ని సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులను రుయా ఆస్పత్రి మీదుగా నడిచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కొందరు ప్రయాణికులు రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రుయా మీదుగా నడిచే బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నందున ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. మంత్రి స్పందించి రుయా ఆస్పత్రి మీదుగా మరిన్ని బస్సులు నడపాలని జిల్లా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం నుంచి 30 బస్సులను రుయా మీదుగా నడపాలని డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం ఆదేశాలు జారీచేశారు.

## 2025 నాకు ముఖ్యం

**● చెస్ ఛాంపియన్ గుకేశ్**
**● శ్రీవారికి తలనీలాల సమర్పణ**



తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): '2025 నాకు చాలా ముఖ్యం. ఈ ఏడాది చాలా టోర్నమెంట్లు ఉన్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ప్రపంచ నెంబర్ వన్ స్థానం నా గురి' అని ప్రపంచ చెస్ చాంపియన్ గుకేశ్ అన్నారు. సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సంతోషంతో కూడిన గొప్ప అనుభూతి అన్నారు.

## కుమారధారతీర్థ ముక్కోటికి ఏర్పాట్లు

తిరుమల, మార్చి10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 14వ తేదీన జరుగనున్న కుమారధార తీర్థ ముక్కోటికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం ఉదయం 5 నుంచి నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే తీర్థానికి భక్తులను అనుమతిస్తామని టీటీడీ స్పష్టం చేసింది. పాపవినాశనం నుంచి కుమారధార వరకు భద్రతా సిబ్బంది విధుల్లో ఉంటారు. పాపవినాశనం వద్ద భక్తులకు పాలు, కాఫీ, ఉప్మా, పొంగలి, పులిహోర, సాంబారన్నం, పెరుగన్నం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన షెడ్లు, నిచ్చెనలు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.

## పలమనేరు అభివృద్ధికి సహకరించండి


చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి10 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సోమవారం సీఎం చంద్రబాబుకు విన్న వించారు. శాసనసభ సమావేశం అనంతరం సీఎంను ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. నియోజకవర్గంలో గంగన్న శిరస్సు, కైగల్లు ప్రాజెక్టుల నిర్మాణం, మోడల్ మార్కెట్‌యార్డు, సంక్షేమ హాస్టళ్లకు, పాఠశాలలకు భవనాలు, బైరెడ్డిపల్లెలో జామియా మసీదు, షాదీమహల్ నిర్మాణం, వి.కోటలో కోల్డుస్టోరేజిలతో పాటు కళాశాల ఏర్పాటుకు సహకరిం చాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తప్పక సహకరిస్తానని చంద్రబాబు తెలిపారు.

## విద్యాసామగ్రి పంపిణీ



చౌడేపల్లె, మార్చి10(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దేవానంద్ కుటుంబీకులు విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, పెన్సిల్, పుస్తకాలు తదితర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి విశ్రాంత ఎస్ఐ రేగంటి నరసింహులు జ్ఞానపకార్థం 20 సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. వార్డన్ సురేష్, దాత కుటుంబసభ్యులు ఎర్రమ్మ, జ్యోతి, తేజ్‌కార్తిక్, యోగ్‌నికిల్, దీక్షిత్ పాల్గొన్నారు.

## సాధికారత దిశగా మహిళా లోకం


డాక్టర్ హర్షితను సత్కరిస్తున్న సాగర్ రాజ్

కుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళా లోకం అన్ని అడ్డంకులను అధిగమించి సాధికారత దిశగా కదం తొక్కుతోందని కుప్పం డిగ్రీ కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ చైర్మన్ సాగర్‌రాజ్‌లు అన్నారు. కుప్పం మండలంలోని ఎన్.కొత్తపల్లె గ్రామంలో సోమవారం బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధ సంస్థ అయిన కుప్పం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ హర్షితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ సుధారాణి, మహిళా సాధికారత విభాగం కో-ఆర్డినేటర్ ఆశ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మొదలియార్ కులాన్ని ఓబీసీగా గుర్తించాలి

కుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ-డీలో ఉన్న మొదలియార్ కులాన్ని ఓబీసీగా గుర్తిం చాలని మొదలియార్ సాధికార సమితి నాయకులు కోరారు. కుప్పంలో సోమవారం వారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్య క్రమంలో నియోజకవర్గ మొదలియార్ సాధికార సమితి అధ్యక్షుడు మునిరత్నం, ఉపాధ్య క్షుడు సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్ చెక్కునత్తం మణి, యువత అధ్యక్షుడు బాలాజీ, ప్రభు, మంజు, కార్తీక తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యాజ్యోతి సావిత్రిబాయిపూలే


పూలే జీవిత చరిత్రను విద్యార్థినులకు వివరిస్తున్న అధ్యాపకురాలు

పలమనేరు, మార్చి10 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలకు విద్యను అందించిన విద్యాజ్యోతి సావిత్రిబాయి పూలే అని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేసులు పేర్కొన్నారు. సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ శశికళ సావిత్రిబాయి పూలేజీవిత చరిత్రను విద్యార్థినులకు వివరించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులకు ఘనసన్మానం



బైరెడ్డిపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవ సంబరాల్లో భాగంగా బైరెడ్డిపల్లె ఎమ్మార్సీ వద్ద సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆయాశాఖల్లో సేవలం దిస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఐసీడీఎస్ సీడీపీవో అరుణశ్రీ, తీర్థం పీహెచ్‌సీ వైద్యులు పద్మావతి, వెలుగు ఏపీఎం లలిత, విశ్రాంతం ఎంఈవో సాయిలీలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎంఈవో వేణు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలుడి విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకారంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వాములు

చౌడేపల్లె, మార్చి10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం వేదపండితులు వృషభ లగ్నమందు స్వామివార్లకు ప్రాణ ప్రతిష్ఠ, నాడీసంధానం, నేత్రోన్మీళన, కళాహోమం, జయాదిహోమం, పూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. సాయంత్రం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

పుంగనూరు రూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పుంగనూరు అర్బన్‌సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పట్టణంలోని మేలుపట్లకు చెందిన రమణ కుమారుడు బాలాజీ(28) సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులో గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

రామకుప్పం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బగళనత్తం గ్రామంలో ఓ వ్యక్తి నుంచి పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. బగళనత్తంకు చెందిన సుబ్రహ్మణ్యం(42) కొంతకాలంగా గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తునట్టు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం పోలీసులు అతని ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

## 13న రామకుప్పంలో ఉపాధి హామీ ప్రజావేదిక

రామకుప్పం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై ఫిబ్రవరి 27నుంచి ప్రారంభమైన సామాజిక తనిఖీ ఈనెల 12 వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ తనిఖీలపై 13న స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక జరుగుతుందన్నారు. ఈ ప్రజావేదికకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కూలీలు హాజరు కావాలని ఆయన కోరారు.

## రేపటి నుంచి నాగనాగదీశ్వర ఆలయ వార్షిక ఉత్సవాలు

గుడుపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాడేపల్లె గ్రామంలోని నాగనాగదీశ్వర ఆలయ వార్షిక ఉత్సవాలను ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిం చనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ, గురువారం అంకురార్పణ, రుద్రాభిషేకం, కల్యాణోత్సవం శుక్రవారం ప్రాకారోత్సవం, పుష్ప పల్లకి, శనివారం శయనోత్స వం జరుగుతందని వివరించారు. ప్రతిరోజూ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## 14న పిఠాపురం తరలిరండి

సోమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవానికి సోమల మండలం నుంచి అధికసంఖ్యలో జనసైనికులు, నాయకులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూణం రాయల్ కోరారు. సోమవారం సోమలలో పార్టీ అభిమానులతో ఆయన మట్లాడారు. మండలం నుంచి పిఠాపురం వెళ్లడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ హరినారాయణ, రామకృష్ణ, కైవారం మురళి, రఘు, శ్రీనివాసులు, చాను, పవన్ కుమార్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

సోమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బెన్నురాజ్ హెచ్చరిం చారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిం చారు. మిట్టపల్లెలో జరుగుతున్న భూరీసర్వేపై వీఆర్‌వోలతో సమీక్షించారు. సచివాలయాల్లో వచ్చే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

## కల్పవృక్ష వాహనంపై ఊరేగిన శ్రీవారు



పుంగనూరు, మార్చి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కళ్యాణవెంకటరమణస్వామి కల్పవృక్ష వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్ప పల్లకీలో ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు పట్టణంలోని బ్రాహ్మణవీధి, బజారువీధి, తేరువీధి, కుమ్మరవీధుల మీదుగా ఊరేగించారు. భక్తులు స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పుంగనూరు రూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగే మహాధర్నాకు మద్దతుగా సోమవారం పుంగనూరులో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమతో పాటు ఆయాలకు వర్తింపజేయాలని, గ్రాడ్యుటీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, ప్రేమకుమారి పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రొంపిచెర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టరు వినయ్ సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేశారు. గర్భిణులు ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. వేసవిలో మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ద్రవాలను తీసుకోవాలన్నారు. ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్ఎన్ పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


చికిత్స అందిస్తున్న డాక్టరు వినయ్

# ప్రతి మహిళనూ లక్షాధికారి చేస్తాం


ఈ-సైకిల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళనూ లక్షాధికారులు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షులు భాష్యం విశ్వనాథనాయుడులు తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మహిళలకు ఈ- సైకిల్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మొత్తం 60 మందికి ఈ-సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40వేల విలువైన సైకిల్‌ను రూ.9వేలకే ఇస్తున్నామని తెలియజేశారు. చిరు వ్యాపారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉదయ్ కుమార్, విజయరామి రెడ్డి, నాగరాజు, ఆంజినేయ రెడ్డి, బాలక్రిష్ణ, శ్యామల, అనుసూయ, ఏపీఎం శ్రీనివాసులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గజవాహనంపై శ్రీవారి అభయం



సోమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవ మూర్తులు గజవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. సోమవారం ఉదయం ఆలయశుద్ధి అనంతరం మూలవిరాట్‌కు కాపురెడ్ల సంఘం ఆధ్వర్యంలో విశేష పుష్పాలంకరణలు, అభిషేక, అర్చనలు చేశారు. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె కాపురెడ్ల సంఘం సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం మోహిని ఉత్సవం జరిపారు. రాత్రి బాణసంచా వేడుకలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. మహిళలు కర్పూరనీరాజనాలు పలికారు. కాగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం, గరుడసేవ నిర్వహిస్తున్నట్లు బలిజ సంఘ సభ్యులు తెలిపారు. టీటీడీ అధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## హనుమంతుడిపై లక్ష్మీనరసింహుడి విహారం



కల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంత వాహనంపై లక్ష్మీ నరసింహస్వామి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. వాహనం ముందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. స్వామివారికి కర్పూర నీరాజనాలు పలికారు. విశ్వబ్రాహ్మణ, బెస్త, కుమ్మరి సంఘం వారు హనుమంతవాహన సేవకు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

- నేడు సింహవాహనంపై నారసింహుడు

మంగళవారం సింహవాహనంపై లక్ష్మీ నరసింహస్వామి విహరించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే బ్రహ్మోత్సవ కమిటీ పూర్తి చేసింది.

## ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో మధుసూదనరెడ్డి

రొంపిచెర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎం పీడీవో మధుసూదనరెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టరు సరళ మాట్లాడుతూ ఈనెల 31 వరకు దరఖా స్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వ తేదీన నిర్వ హించనున్నారని తెలిపారు.. ఐదవ తరగతి స్థాయిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్ష ఉంటుందని తెలియజేశారు. ఏప్రిల్ 27వ తేదీ మెరిట్ జాబితా విడుదల చేస్తారని వివరించారు. అలాగే 7, 8, 9 తరగతులలో ప్రవేశాలకు జూన్ మొదటి వారంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# పలువురు దాతలకు సన్మానం


ఉపాధ్యాయులతో దాత షణ్ముగం తదితరులు

వి.కోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం గంధారమాకులపల్లె ఉన్నత పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థి షణ్ముగం రూ.5లక్షలతో స్టేజ్‌ను నిర్మించి ఇచ్చారు. సోమవారం పాఠశాల వార్షికోత్స వం సందర్భంగా దాతను పాఠ శాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలాగే గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పూజ, మౌనికలకు రూ.15వేలు మునిరాజ్ అందించారు. పాఠశాల అభివృద్ధికి చందు మరికొందరు ఆర్థిక సాయం అందించారు. వీరందరినీ సత్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# మహాధర్నాను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు

వి.కోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న విజయవాడలో జరిగే మహాధర్నాకు ప్రతి ఒక్క గ్రామ పంచాయతీ కార్మికుడూ తరలి రావాలని జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గోవిందు కోరారు. సోమవారం వి.కోట సచివాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మకులకు కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉదయ్‌కుమార్, వెంకటరమణ, చంద్రశేఖర్, ముత్తు, రాజమ్మ ఉన్నారు.

## హనుమంత వాహనంపై నలగుండ్రాయస్వామి కటాక్షం



బైరెడ్డిపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైన నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి హనుమంత వాహనోత్సవం ఘనంగా జరిగింది. అలివేలుమంగ, పద్మావతీసమేత నలగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు రామకృష్ణాచార్యులు విశేషాలంకరణ చేసి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం హనుమంత వాహనంపై కొలువు దీర్చి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమానికి కడపనత్తం గ్రామానికి చెందిన కరణంశేషగిరిరావు కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రేపు కల్లూరు సంత, ప్రైవేటు బస్టాండు, షాపింగ్ గదుల వేలం

కల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక వారపు సంత, షాపింగ్ గదులు, ప్రైవేటు బస్టాండు గేటు వేలం వేయనున్నట్లు సర్పంచ్ షుకూర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. సంతకు రూ.6లక్షలు, ప్రైవేటు బస్టాండుకు రూ.3 లక్షలు, షాపింగ్ గదులు ఒక్కొక్కటికి రూ.20 వేలు డిపాజిట్‌ను ఒకరోజు ముందుగా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు పంచా యతీ కార్యదర్శిని సంప్రదించాలని తెలియజేశారు.

## కందూరు సీతారామాలయంలో ప్రత్యేక పూజలు



సోమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కందూరులో వెలసిన సీతా సమేత కోదండ రామాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వ హించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం హోమాది కార్యక్రమాలు వేద పండితులు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో జరిపారు. ధ్వజస్తంభ ఏర్పాటుకు సహక రించిన దాతలను కందూరు బలిజ సంఘ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పగడాలవారిపల్లె, వల్లిగట్ల, గల్లావారిపల్లె, కొత్తపల్లె, కందూరు తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహ కారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని వైద్యాధికారి విజయచందర్ పంపిణీచేశారు. తల్లిపాల ప్రాముఖ్యత, వడదెబ్బ నివారణ, పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## రేపటి నుంచి మార్గసాహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో కొలువైన మార్గసాహేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించ నున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ ధ్వజారోహణం, అంకురార్పణ, కలశ స్థాపన, 13న కల్యాణోత్సవం, నంది వాహనోత్సవం, 14న రథోత్సవం, 15న దోపోత్సవం, వసంతోత్సవం, 16వ తేదీ గ్రామోత్సవం, శయనోత్సవం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఇరు వర్గాల ఘర్షణ 15 మందిపై కేసు నమోదు

వి.కోట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిసముద్రంలో శనివారం రాత్రి ఇంటి స్థలం విషయమై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 9 మంది గాయపడ్డారు. గొడవపై పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. సీఐ సోమశేఖర్ 15 మందిపై రెండు కేసులు నమోదు చేశారు. యువరాజ్ ఫిర్యాదు మేరకు సుబ్రమణ్యం, అరుణాకర్, నవీన్, వసంత్, సుగుణమ్మ, విజయ, శ్యామరాజు, విజయలక్ష్మీలపై కేసు నమోదు చేశారు. సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు నాగరాజు, అనిల్, యువరాజ్, బాలాజీ, భరత్, శివ, నరేష్‌లపై మరో కేసు నమోదు చేశారు. సోమవారం ఇరు వర్గాలను తహసీల్దార్ పార్వతి ఎదుట హాజరు పరిచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

# చెరువులో ఆక్రమణలు తొలగించండి


నిరసన తెలియజేస్తున్న సంతూరు గ్రామస్తులు

శాంతిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంతూరు చెరువులో ఆక్రమణలు తొలగించాలని మఠం పంచాయతీ ప్రజలు సంతూరు గ్రామస్తులతో కలిసి మండల సచివాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతూరు చెరువును ఆక్రమించి అదే గ్రామానికి చెందిన కొందరు గృహాలను నిర్మించుకున్నారని తెలియజేశారు. రెండు నెలల క్రితం కడా ఎస్‌వోకు, కుప్పం ఆర్డీవోకు, శాంతిపురం తహసీల్దారుకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ చేపట్టిన అధికారులు 15 రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగడంతో ఎంపీడీవో కుమార్, తహసీల్దారు శివయ్య వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు ఎంత చెప్పినా వినకపోవడంతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, కడా ఎస్‌వోకు ధర్నా విషయం తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కలెక్టరుతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని కలెక్టరు ఆదేశించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

## ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపండి

### డీఎఫ్‌వోకు బాధిత రైతుల వినతి



డీఎఫ్‌వో భరణికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

బంగారుపాళ్యం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడుల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని డీఎఫ్‌వో భరణిని బాధిత రైతులు కోరారు. సోమవారం ఈ మేరకు రాగిమానుపెంట, వెలుతురుచేను, పులిమడుగు, కేఎం కండ్రిగ, కీరమంద, కొదలమడుగు, బండ్లదొడ్డి, మొగిలివారిపల్లె గ్రామాలకు చెందిన రైతులు ఆమెకు వినతిపత్రం సమర్పించారు. ఏనుగుల దాడులతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టరు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె చెప్పినట్లు రైతులు తెలిపారు. నాగరాజు నాయుడు, బాలకృష్ణమనాయుడు, సతీష్‌నాయుడు, రమేష్, గజపతి, తదితరులు పాల్గొన్నారు.

## మాకిచ్చిన స్థలాలు కబ్జా చేశాడు: దళితులు

శ్రీరంగరాజపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను ఓ వ్యక్తి కబ్జా చేశాడని సోమవారం తహసీల్దార్ లోకనాథం వద్దకు పిళ్లారికుప్పం దళితవాడకు చెందిన టి.కుప్పయ్య ఫిర్యాదు చేశాడు. పిళ్లారికుప్పంలోని సర్వే నెంబరు 8/12లో 0.12 సెంట్లు, 8/13లో 0.87 సెంట్లు, 8/14లో 0.17 సెంట్లు, 8/15లో 0.54 సెంట్ల భూమి(మందబైలు)లో ఎనిమిది మంది దళితులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని చెప్పారు. ఈ భూమిని గ్రామానికి చెందిన ఓ చోటా నేత రాత్రికి రాత్రే కబ్జాచేసి.. టెంకాయ చెట్లు పెట్టి.. చుట్టూ కూసాలు నాటాడని వాపోయాడు. ఇదేంటని అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరాడు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న నగరి డీడీవో ఖాదర్ బాషా

నిండ్ర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రి, బీసీ సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం నగరి డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) ఖాదర్ బాషా తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో మందులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలను అప్పగించండి: ఎస్టీల వినతి

వెదురుకుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కంచెను తొలగించి తమ ఇంటి స్థలాలను అప్పగించాలని కార్వేటినగరం కాశాతోట వీధికి చెందిన ఎస్టీలు సోమవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రమిచ్చారు. 1989లో ఎస్టీలు 25మందికి సర్వే నెంబర్లు 938/1, 338/3లో ఇంటి స్థలాలను కేయించారని తెలిపారు. సమీపంలో ఉన్న ఓ రైతు తమకిచ్చిన స్థలాలతోపాటు కాలువ పోరంబోకు, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కంచె వేశాడని ఫిర్యాదు చేశారు. అలాగే కోట చెరువుకు వెళ్లే కలుజు కాలువను సైతం ఆక్రమించాడన్నారు. వెంటనే విచారించి, న్యాయం చేయాలని కోరారు.

## సమస్యలను వేగంగా పరిష్కరించండి: కమిషనర్



బాధితుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజనీరింగ్‌కు 8, పబ్లిక్ హెల్త్‌కు 2, టౌన్ ప్లానింగ్‌కు 2, రెవెన్యూకు ఒకటి చొప్పునమొత్తం 13 అర్జీలు అందాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

గుడిపాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చెరువుముందరపూరు గ్రామంలో రెండ్రోజులుగా నిర్వహించిన వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ కల్యాణోత్సవం సోమవారం వసంతాలతో ముగిసింది. ఈ సందర్భంగా చెరువుముందరపూరు, గుడిపాల క్రాస్ పురవీధుల్లో బాణసంచా వేడుకల మధ్య మంగళవాయిద్యాలతో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. గ్రామ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన



గుడిపాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంటలను ఏరువాక శాస్త్రవేత్త సంధ్య, ఏవో మాధవి పరిశీలించారు. వరి, మిరప పంటల్లో ప్రస్తుతం తెగుళ్లు వస్తున్నాయని చెప్పారు. నివారణ చర్యలను తెలియజేశారు. సహాయ సంచాలకులు నాగపద్మిని, రైతులు పాల్గొన్నారు.

## అభిషేక పండుగలు ప్రారంభం



కార్వేటినగరంలో అభిషేక పండుగలను ప్రారంభిస్తున్న ఆశీర్వాదం

వెదురుకుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో సోమవారం రాత్రి బేతేల్ షారోన్ చర్చి పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో అభిషేక పండుగలను ప్రారంభించారు. విశ్వాసకులతో ఆ ప్రాంతం నిండిపోయింది. పొద్దుటూరుకు చెందిన కళ్యాణ్ బాబు, చెన్నైకి చెందిన థామస్ చాకో, బాబు, మోసెస్‌బాలన్ విశ్వాసకులకు అభిషేక పండుగల విశిష్టతను వివరించారు.

## టీడీపీ నేత మృతికి సంతాపం

నగరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని మాంగాడుకు చెందిన గోపి అనే టీడీపీ నాయకుడు మృతి చెందాడు. దీంతో సోమవారం ఆయన మృతదేహానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. వీరిలో నగరి మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, నాయకులు శ్రీనివాసరెడ్డి, నారాయణస్వామి నాయుడు, అలెక్స్ రవి రాజా ఉన్నారు.

## డీసీసీ అధ్యక్షుడికి పితృ వియోగం



శంకరయ్య (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తండ్రి బలిజ మొండివెంగనపల్లెకు చెందిన మాజీ ఉప సర్పంచ్ శంకరయ్య(78) సోమవారం మృతి చెందారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి, పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

## కబ్జాదారుల నుంచి భూమిని కాపాడండి

● కాట్పాడివాసి వినతి

చిత్తూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల నుంచి తమ భూమిని కాపాడాలని తమిళనాడు రాష్ట్రం కాట్పాడికి చెందిన విజయన్ కోరారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరుకు చెందిన రావుబాదూరు గొల్ల గుర్రప్పనాయుడు ఆస్తులకు సంబంధించి జీపీఏను తన పేరిట ఇచ్చారని చెప్పారు. సదరు భూములు మంగసముద్రం, తేనెబండ, తిమ్మసముద్రం, గుర్రప్ప నాయుడు కాలనీ, కొంగారెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు. ఇపుడా భూముల వద్దకు తనకు వెళ్లనీయకుండా కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారుల అండతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

## పని ఒత్తిడి తగ్గించండి

### పంచాయతీ కార్యదర్శులు

నిండ్ర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తమపై పని ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీవో శివప్రసాద్ వర్మకు పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. పంచాయితీ కార్యదర్శుల సంఘ నేత వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి / ఖాళీ బిందెలతో మహిళల నిరసన

వెదురుకుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామ సచివాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఆర్కేవీబీపేటలోని చిన్నవీధిలో 70 కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్నామని చెప్పారు. ఈ వీధిలో నీరు రావడం లేదని పలుసార్లు సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించకుంటే ఖాళీ బిందెలతో కలెక్టరేట్‌కు వెళతామని హెచ్చరించారు. నిరసన తెలిపినవారిలో వృద్ధులు ఎక్కువమంది ఉన్నారు.

ఆర్కేవీబీపేట సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు



## అంగన్వాడీల నిర్బంధం దారుణం: సీఐటీయూ, ఏఐటీయూసీ



కార్వేటినగరంలో అంగన్వాడీల నిరసన

చిత్తూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కోసం విజయవాడకు బయల్దేరిన అంగన్వాడీలను నిర్బంధించడం దారుణమని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు.. అంగన్వాడీలకు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలం అవుతున్నా ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. నేతలు సురేంద్రన్, నాగరాజు, కోదండయ్య, గంగరాజు, రమాదేవి, చంద్ర, మణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** విజయవాడ ధర్నాకు వెళ్లకుండా కార్వేటినగరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.విజయ ఆరోపించారు. అందువల్ల కార్వేటినగరంలో నిరసన తెలుపుతున్నామని చెప్పారు. కోశాధికారి లక్ష్మీనరసమ్మ, రెడ్డెమ్మ, షైమ తదితరులు పాల్గొన్నారు.

## గ్లకోమా వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్లకోమా వారోత్సవాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్‌వో సుధారాణి, డీటీసీఎస్ అర్పిత, సిబ్బంది పాల్గొన్నారు.

## మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహిస్తున్న మంగళ విద్యావాణి 34వ సంచికను జేసీ విద్యాధరి ఆవిష్కరించారు. సోమవారం జేసీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి మాసపత్రిక వివరాలను తెలియజేశారు. అనంతరం పాఠశాలకు తనవంతుగా రూ.15వేలను అందిస్తానని జేసీ ప్రకటించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ శివప్రసాద్, సంచిక దాత నలగాంపల్లె ధరణీప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వంటమనిషి మృతి



నందకుమార్ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర హాస్టల్‌లో వంటమనిషిగా పనిచేస్తున్న నందకుమార్(45) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం హాస్టల్‌లో విద్యార్థులకు టిఫిన్ చేసి పాఠశాలకు వెళ్లాక ఇంటికొచ్చిన కొద్దిసేపటికే ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూ షకీల, వార్డెన్లు రమేష్, రమాదేవి, వెంకటేశ్, సదాశివమ్మ, శాంతరాజ్, నవీన్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.25వేలను కుటుంబీకులకు అందించారు. నందకుమార్ స్వస్థలం శ్రీకాళహస్తి అయినా ఇక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

## ఎన్జీవో సంఘ వ్యవస్థాపకుడికి నివాళి



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎన్జీవో సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో సంఘం వ్యవస్థాపకుడు ఆమనగంటి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి, నివాళి అర్పించారు. సోమవారం ఎన్జీవో భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, నేతలు ప్రదీప్, బాలసుబ్రహ్మణ్యం, రమేష్, భానుప్రకాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథకు అంత్యక్రియలు



చిత్తూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధురాలికి అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. బాలాజీ కాలనీలోని ఓ పాడుబడ్డ ఇంట్లో వృద్ధురాలు మృతి చెందిన విషయాన్ని పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వారు అమ్మఒడికి తెలియజేయగా, ఆశ్రమ నిర్వాహకులొచ్చి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్టు ఫౌండర్ పద్మనాభనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

## నాటు తుపాకి స్వాధీనం: ఒకరి అరెస్టు



నాటుతుపాకితో పట్టుబడ్డ కాశీ

బంగారుపాళ్యం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. వెలుతురుచేను పంచాయతీ పులిమడుగుకు చెందిన బాలకృష్ణ కుమారుడు కాశీ(40) సోమవారం ఉదయం గ్రామ సమీపంలో నాటు తుపాకితో అడవి జంతువులను వేటాడుతున్నాడని సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు అటవీప్రాంతానికి చేరుకుని కాశీని పట్టుకున్నారు. అతడివద్దనుంచి నాటుతుపాకిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీఆర్వో చంద్ర, పోలీసు సిబ్బంది నీరజాక్షులు, రమేష్, చంద్ర, నటరాజ్ పాల్గొన్నారు.

## 20 లీటర్ల సారా స్వాధీనం



వెదురుకుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గెరిగిదొన అటవీ ప్రాంతంలోని సారా స్థావరాలపై దాడులు జరిపి ఇరవై లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్స్‌పెక్టరు వైవీ పవన్‌కుమార్ తెలిపారు. అలాగే రెండు వందల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, గెరిగిదొనకు చెందిన గోపిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) అసిస్టెంటు కమిషనర్ ఆదేశాలతో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో దేవప్రసాద్, ఢిల్లీబాబు, రాజేష్, తంబీష్, కృష్ణవేణి, దీపా పాల్గొన్నారు.

## ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

తవణంపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తవణంపల్లె పోలీసులు తెలిపారు. జోగివారిపల్లెకు చెందిన సుఖేష్, టి.పుత్తూరు హరిజనవాడకు చెందిన కిషోర్ మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. సుఖేష్ వద్ద నుంచి 23 మద్యం బాటిళ్లు, కిషోర్ వద్ద నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

## మామ, బావమరిదిపై కత్తితో దాడి



గాయపడ్డ సేటు

యాదమరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మామ, బావ మరిదిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. మామకు తీవ్ర గాయాలయ్యాయి. గొందివాళ్లవూరు గ్రామానికి చెందిన సేటు (55) కుమార్తె రోజాను అదే గ్రామానికి చెందిన చంద్రన్ కుమారుడు యువరాజు ప్రేమించి మూడేళ్ల కిందట పెళ్లి చేసుకున్నాడు. తర్వాత జులాయిగా తిరుగుతుండటంతో అల్లుడిని మామ మందలించాడు. దీంతో కక్ష పెంచుకుని సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మామతోపాటు బావమరిది మునియప్పన్ (25)పై కత్తితో దాడి చేశాడు. సేటుకు తలపైన తీవ్ర గాయాలయ్యాయి, మునియప్పన్ చేతివేళ్లు దెబ్బతిన్నాయి. బాధితులను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఇద్దరు సారా విక్రేతల అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

చిత్తూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు సారా విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు. సోమవారం గుడిపాల మండలం 189 కొత్తపల్లె గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనంలో వస్తున్న రాసనపల్లెకు చెందిన చంద్రశేఖర్, 189 కొత్తపల్లెకు చెందిన చిన్నాలను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా గోనె సంచుల్లో తరలిస్తున్న 25 లీటర్ల సారాను గుర్తించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో రాసనపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీకి బెల్లం సరఫరా చేసే ముటుకూరుపల్లెకి చెందిన రోహిత్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### లక్ష్మీ నరసింహుడికి అభిషేకం

శ్రీరంగరాజపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగుంటలోని లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకుడు వెంకటాచాలపతి, ఎగువ మంగుంట, దిగువ మంగుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

### మహిళా టీచర్లకు సన్మానం

విజయపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా టీచర్లను సత్కరించారు. హెచ్‌ఎం జ్ఞానకుమార్, టీచర్లు పాల్గొన్నారు.

**చీరల వితరణ:** మల్లారెడ్డి కండ్రిగలో సోమవారం పేద మహిళలకు చీరలను గోపి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, జగన్నాథం, ధనుంజయులు, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మహిళా దినోత్సవం

వెదురుకుప్పం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారదను సన్మానించారు.

### విద్యాసామగ్రి వితరణ



విజయపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పన్నూరు ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను సోమవారం విజయపురం పురోహితుడు వందవాసి మహేష్‌శర్మ వితరణ చేశారు. హెచ్‌ఎం జానకిరామరెడ్డి, రిటైర్డు టీచరు చంద్రయ్య పాల్గొన్నారు.

### రేపు వైసీపీ యువత పోరు

చిత్తూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, యువతకు చేసిన మోసంపై బుధవారం యువత పోరు కార్యక్రమం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్నట్లు చిత్తూరు వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 12న ఉదయం 9.30గంటలకు పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వద్దకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. మొదలియార్ సంఘం రాష్ట్ర చైర్మన్ జ్ఞాన జగదీశ్, వైసీపీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** పుత్తూరులోని నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో యువత పోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జీడీనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆవిష్కరించారు. వెదురుకుప్పం ఎంపీపీ నాగరాణి, కామసాని పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 15నుంచి పొన్నియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం

చిత్తూరు కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మ ఆలయం మహా కుంభాభిషేకం ఈనెల 15,16,17 తేదీల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఉదయం ఆలయ ట్రస్టీ సీకే లావణ్య తన నివాసంలో ఆవిష్కరించారు. హేమంత్, వెంకటేశ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### 23న టౌన్ బ్యాంకు సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు జనరల్ బాడీ సమావేశం ఈనెల 23వ తేదీన ఉదయం 10.30 గంటలకు జరగనుంది. గిరింపేట బ్యాంకు భవనంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జి నారాయణమ్మ తెలిపారు. సమావేశానికి 'ఏ' తరగతి సభ్యులు, డిపాజిట్ షేర్‌హోల్డర్లు బ్యాంకు జారీచేసిన గుర్తింపు కార్డులతో హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

## ఇటుకల వ్యాపారంలో తమిళ తంబీల దందా

### నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని స్థానికుల ఆరోపణ

పాలసముద్రం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇటుకల వ్యాపారంలో తమిళ తంబీల దందా అడ్డుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దీనబంధుపురం, సింహరాజుపురం, నరసింహాపురం,బాలకృష్ణాపురం,కన్నికాపురం,ఆముదాల గ్రామాల్లోని భూములను కొందరు తమిళనాడుకు చెందిన ఇటుకల వ్యాపారులొచ్చి లీజుకు తీసుకుని జనవరి నుంచి జూన్ వరకు ఇటుక బట్టీలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం అక్కడి చెరువుల్లో మట్టి తీసుకోవడానికి అనుమతి ఇవ్వదు. దాంతో ఆ రాష్ట్రంలోని వ్యాపారులు కొన్నేళ్లుగా వేసవికాలం వస్తోందంటే.. పెద్ద ఎత్తున ఇక్కడికొచ్చి ఇటుకలు తయారు చేసుకుని, తమిళనాడుకు తరలించుకుని వెళుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. తమిళనాడు వ్యాపారంతా నిబంధనలకు విరుద్ధంగా తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఇక్కడి అధికారులు కూడా సహకరిస్తున్నారన్న విమర్శలూ లేకపోలేదు.




దీనబంధుపురంలో పచ్చి ఇటుకలు తయారు చేస్తున్న కూలీలు - తమిళనాడుకు ట్రాక్టర్‌లో తరలుతున్న పచ్చి ఇటుకలు



ఇటుక బట్టీ

**ఇలా కూడా..:** ఇటుకలను కాల్చడానికి అవసరమైన కలప కోసం కూడా సమీప రైతులను ప్రలోభాలకు గురిచేసి.. వేప, చింత, కానుగ వంటి చెట్లను నరికేస్తున్నారని తెలిసింది. ఇది వీలుకానివారు పచ్చి ఇటుకలను తమిళనాడు ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ బొగ్గు ద్వారా కాలుస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

